క్లుప్తంగా



పూజలు చేస్తున్న భక్తులు

మహాగౌరి అలంకరణలో దుర్గామాత

ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీవేణు గోపాల స్వామి ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం అమ్మవారిని మహాగౌరిమాతగా అలకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మంచినీటి బావిలో పక్షి కళేబరం



బావి నుంచి పక్షి కళేబరాన్ని తీస్తున్న జీపీ సిబ్బంది

నడికూడ : మండల కేంద్రం గొల్లపల్లి రోడ్డులోని మంచి నీటి బావిలో మూడు, నాలుగు రోజుల క్రితం చనిపోయిన కొంగ కళేబరాన్ని జీపీ సిబ్బంది తొలగించారు. నీటి పై పక్షి ఈకలు, శరీర భాగాలు తేలి ఉండడంతో స్థానికులు గుర్తించి 'సాక్షి'కి సమాచారం అందించారు. ఈ విషయం 'సాక్షి' విలేకరి గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీఓ చేతన్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పంచాయతీ సిబ్బంది సహకారంతో బావి నుంచి పక్షి కళేబరాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. రెండు రోజుల వరకు ఈ నీరు తాగొద్దని, ఇతర అవసరాల కోసం వాడుకోవాలని సూచించారు. కాగా, బావిలో పక్షి చనిపోయి రెండు, మూడు రోజులు అవుతున్నా గుర్తించకపోవడంపై అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పిల్లర్లు తొలగించిన వ్యక్తులపై కేసు

దామెర: అక్రమంగా భూమిలోకి చొరబడి పిల్లర్లు తొలగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొంక అశోక్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని ఊరుగొండలో చల్లా రమాదేవికి చెందిన భూమిలోకి పసరగొండ గ్రామానికి చెందిన కొటం ఐలయ్య, దుర్గాపేట్‌కు చెందిన పొదాల మధుకర్ ఈ నెల 7వ తేదీన అక్రమంగా చొరబడి పిల్లర్లు తొలగించారు. ఈ ఘటనపై రమాదేవి భర్త శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఐలయ్య, మధుకర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గురువారం తెలిపారు.

బైక్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

నడికూడ: నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ఓ బాలుడు బైక్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి సత్తెమ్మ బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో మండలంలోని గొల్లపల్లికి చెందిన బాలుడు బైక్‌పై వెళ్తూ సత్తెమ్మను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రురాలిని స్థానికులు వెంటనే పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న కొండల్

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన ట్రాఫిక్ కానిస్టేబుల్ పోశాల కొండల్‌కు సెల్‌ఫోన్ దొరకగా బాధితుడికి అప్పగించారు. హనుమకొండలోని బాలాంజనేయ స్వామి ఆలయం వద్ద కానిస్టేబుళ్లు అన్వేశ్‌కుమార్, కొండల్ గురువారం ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి సమీపంలో సెల్‌ఫోన్ దొరకడంతో ఫోన్ చేసి బాధితుడికి అప్పగించారు. దీంతో బాధితుడు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బందోబస్తు ఏర్పాటు చేయండి

హసన్‌పర్తి: విజయదశమిను పురస్కరించుకుని ఎర్రగట్టు గుట్ట వద్ద శనివారం నిర్వహించనున్న రావణవధకు బందోబస్తు ఏర్పాటు చేయాలని యూత్ అసోసియేషన్ కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు కేయూసీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్‌ను గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎర్రగట్టు గుట్ట యూత్ అసోసియేషన్ సభ్యులు నంది శ్రీనివాస్, మూల దేవేందర్, పాపిశెటి దిలీప్, రాజశేఖర్, శీలం రాహుల్, నిహార్, ప్రణీత్, సన్నీర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శాయంపేట : బతుకమ్మలతో బయలుదేరుతున్న మహిళలు



కమలాపూర్: గుడి బండ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ధర్మసాగర్: బతుకమ్మలు తీసుకెళ్తున్న మహిళలు



సద్దులు.. సంబురంగా

- ఘనంగా బతుకమ్మ వేడుకలు
- ఆనందంగా ఆడిపాడిన ఆడపడుచులు
- పూలవనాలైన చెరువుల గట్లు, ఆలయాలు



శాయంపేటలో తాళ్లకుంట చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సద్దుల బతుకమ్మ.. సంబురంగా జరిగింది. మహిళలు ఉదయమే లేచి తలంటు స్నానం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. వివిధ రకాల ఫలహారాలు చేశారు. సాయంత్రం బతుకమ్మలను పట్టుకుని దప్పుచప్పుళ్ల మధ్య చెరువులు, ఆలయాల వద్దకు వెళ్లారు. అక్కడ బతుకమ్మలను కింద ఉంచి ఆనందంగా ఆడిపాడారు. చిత్తూ చిత్తూల బొమ్మా.. శివుడి ముద్దుల గుమ్మ.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం ఆయా చోట్ల బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

శాయంపేట : మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాయంపేట సీఐ రంజిత్‌రావు, ఎస్సై ప్రమోద్‌కుమార్ సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆటస్థలాల్లో బందోబస్తు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు మల్టీ పర్పస్ సిబ్బందితో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. శాయంపేటలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ డీజే సౌండ్స్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, గ్రామపెద్ద జిన్నా ప్రతాప్‌సేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. మహిళలు కోలాటాలు ఆడుతూ, పాటలు పాడుతూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

ఐనవోలులో

ఐనవోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆయా జీపీల ఆధ్వర్యంలో చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో..

ఎల్కతుర్తి: ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళలు ఉదయం తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బతుకమ్మలను నెత్తినెత్తుకుని ఊరేగింపుగా ఆయా గ్రామాల్లోని ప్రధమ కూడళ్లకు, చెరువు వద్దకు తీసుకెళ్లి బతుకమ్మను ఆరాధిస్తూ ఆడిపాడారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం బతుకమ్మను చెరువుల్లో నిమజ్జనం చేశారు. కాగా, బతుకమ్మ ఆట సమయంలోనే కురిసిన భారీ వర్షంతో వేడుకలకు అంతరాయం ఏర్పడింది. అందంగా పేర్చిన బతుకమ్మలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అధికారులు బతుకమ్మ ఆట స్థలాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళలకు ఇబ్బందులు కలుగకుండా సీఐ పులి రమేశ్ ఆధ్వర్యంలో ఆటస్థలాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్: ధర్మసాగర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయమే మహిళలు బతుకమ్మలు పేర్చారు. సాయంత్రం చెరువుల వద్దకు తీసుకెళ్లి ఆడిపాడారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

వేలేరులో..

వేలేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సాయంత్రం చెరువులు, దేవాలయాల వద్దకు తీసుకెళ్లి ఆడిపాడారు. పరిసర ప్రాంతాల్లో చిన్నారులు బాణాసంచాలు పేల్చుతూ కేరింతలు కొట్టారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆకతాయిలు బతుకమ్మ వేడుకల్లో గొడవలు చేయకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గురువారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా తరలివెళ్లి ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగుల వద్ద ఆనందోత్సాహాలతో ఆడి పాడారు. పిండి వంటలతో తయారు చేసిన వాయినాలు ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుని సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను, గౌరమ్మ తల్లిని 'వెళ్లి రావమ్మా' అంటూ కొలుస్తూ చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కమలాపూర్‌లో సద్దుల బతుకమ్మ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ హాజరయ్యారు. వేడుకల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షంతో నిరాశ..

ఆడపడుచులు సద్దుల బతుకమ్మలతో తరలి వెళ్తున్న సమయంలో మండల వ్యాప్తంగా ఒక్కసారిగా భారీ వర్షం కురువడంతో ఆడపడుచులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎవరికి వారు తమ వాడల్లోనే బతుకమ్మలు ఆడి పెద్ద చెరువు వద్దకు వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. వర్షంతో బతుకమ్మ ఆడే ప్రదేశాలు బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కమలాపూర్ : పెద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న జీపీ అధికారులు

దామెరలో..

దామెర: మండల వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని దామేశ్వరాలయం ప్రాంగణంతో పాటు పలు గ్రామాల్లోని దేవాలయాలు, చెరువుల వద్ద మహిళలు, చిన్నారులు బతుకమ్మ ఆడారు. దీంతో ఆయా చోట్ల సందడి నెలకొంది.

పరకాలలో..

పరకాల: పరకాల పట్టణంలో ఆడపడచులు సద్దుల బతుకమ్మ వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. కుంకుమేశ్వరస్వామి ప్రాంగణానికి (పశువుల సంత) పెద్ద సంఖ్యలో చేరుకుని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. వర్షం పట్టించుకోకుండా బతుకమ్మలతో చేరుకున్న మహిళలకు మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితారామకృష్ణ, మహిళ కౌన్సిలర్లు పెద్ద బతుకమ్మలతో వచ్చి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం దామెర చెరువు ట్యాంకు బండ్‌లో గౌరవమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ రవీందర్, ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ క్రాంతికుమార్ సమీక్షించారు.



ఐనవోలు: బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు



దామెరలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వేలేరు: బతుకమ్మలతో యువతులు



పరకాల: పశువుల సంతలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నడికూడలో బతుకమ్మతో గ్రామ ప్రత్యేకాధికారి చేతన్‌కుమార్ రెడ్డి

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

శాయంపేట : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు వరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 8లక్షల 50వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఖరీదైన వైద్య చికిత్స చేసుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం మండలంలోని మైలారం, ప్రగతి సింగారం, గట్లకానిపర్తి గ్రామాల్లో బతుకమ్మ తల్లి విగ్రహాలను ఆవిష్కరించి మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండలంలోని మాందారిపేటలో దుర్గమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ప్రగతి సింగారంలో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సత్యనారాయణ రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

శాయంపేట గ్రామంలో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సంఘం నాయకులు గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సలేంద్ర రవీంద్రాచారి, ప్రధాన కార్యదర్శి వినుకొండ సురేంద్రాచారి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలని, వీరబ్రహ్మేంద్రస్వామి వారి విగ్రహం ప్రతిష్ఠాపన కోసం గుడి నిర్మాణానికి ఐదు గుంటల స్థలం కేటాయించాలన్నారు. అలాగే, నిరుపేద విశ్వబ్రాహ్మణులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని, విశ్వబ్రాహ్మణ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిరుపేదలను ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఉప్పునూతుల ప్రసాద్, నాయకులు వినుకొండ శంకరాచారి, ఓంకార్, రాంగోపాల్, సత్యం, చంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ రావు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఖిలా వరంగల్: అనాథ వృద్ధులను ప్రతిఒక్కరూ అక్కున చేర్చుకోవాలని సామాజిక వేత్త కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి సూచించారు. వరంగల్ గవిచర్ల రోడ్డులోని ఎలగందుల అమృత వృద్ధాశ్రమంలో కొండ్రెడ్డి నవీన్, మాధురి ఆధ్వర్యంలో అనాథ వృద్ధులకు గురువారం అన్నదానం చేశారు. ధర్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, కన్నయ్య, కర్ణాకర్, రాంబాబు, నవీన్, రాంచందర్, పర్మేష్, శ్రీనివాస్, వృద్ధాశ్రమ నిర్వాహకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రతన్‌టాటాకు నివాళి

కేయూ క్యాంపస్: ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్‌టాటాకు పలువురు నివాళి అర్పించారు. కేయూ హాస్టళ్ల డైరెక్టర్ కార్యాలయంలో రతన్‌టాటా చిత్రపటానికి ఫార్మసీ కళాశాల డీన్ సమ్మయ్య, హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. విలువలతో కూడిన వ్యాపారం చేస్తూ వచ్చిన ఆదాయంలో 65శాతం వరకు వాటాను దాతృత్వ సేవలకు వినియోగించిన గొప్ప పారిశ్రామిక వేత్త రతన్‌టాటా అని కొనియాడారు.

కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీలో సమసిన వివాదం

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీలో నాలుగు రోజులుగా కొనసాగిన వివాదం సమసిపోయింది. ఈ ఉత్సవ కమిటీని 1986లో ఏర్పాటు చేసిన నాటి నుంచి 'ఆ నలుగురి' కనుసన్నల్లోని కమిటీ కొనసాగుతోంది. ఉత్సవాల్లో చురుకుగా పాల్గొంటున్న యువతరం గత కొన్నేళ్లుగా నూతన కమిటీ ఏర్పాటు చేయాలని పలుమార్లు డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో చురుకుగా పాల్గొంటూ ఉత్సవాలకు అన్ని తానై నడిపిస్తున్న ఇద్దరిలో ఒకరికి వర్కింగ్ ప్రెసిడెంట్, మరొకరికి ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని ఉత్సవ కమిటీలోని మెజార్టీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు వార్తా పత్రికలకు పంపే నోట్‌లో వారి పేర్లతో పాటు హోదాను పేర్కొనడం కొందరికి ఇబ్బందిగా మా రింది. దాంతో ఎన్నికలు లేకుండా ఎలా పదవులు ఇస్తారంటూ ప్రస్తుత నాయకులు ప్రశ్నించడంతో ఉత్సవ సమితిలో ఉత్సాహంగా పనిచేస్తున్న వారు పక్కకు తప్పుకున్నారు. దాంతో ఉత్సవాలకు ముందే కమిటీ చీలితే పరువు పోతుందని భావించిన కొంతమంది స్థానిక నాయకులు.. రంగంలోకి దిగి ఇరువర్గాలకు సముదాయించడంతో గుళ్లపెల్లి (బాంబుల) కుమార్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్న వేముల నాగరాజ్‌ను ఉపాధ్యక్షుడిగా నియమించడంతో సమస్యకు పరిష్కారం లభించింది.

దసరా ప్రశాంతంగా జరుపుకోవాలి

- దామెర ఎస్సై కొంక అశోక్

దామెర: దసరా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఊరుగొండ, ముస్త్యాపల్లి, తక్కళ్లపహాడ్, పులుకుర్తి, పసరగొండ, కోగిల్వాయి, ల్యాదెళ్ల గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శనివారం నిర్వహించే దసరా వేడుకలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలన్నారు. మద్యం సేవించి వేడుకల్లో పాల్గొనొద్దని సూచించారు. అనవసరమైన గొడవల్లో కలుగజేసుకోవద్దన్నారు. యువకులు మద్యం మత్తులో గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎస్సై వెంట ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, కారోబార్లు, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

- ఏపీజీవీబీ రీజినల్ ఆఫీస్ ఏజీఎం చైతన్యకుమార్ కుమార్
- ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

శాయంపేట : బ్యాంకు సేవలను ప్రతీ ఖాతా దారుడు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు రీజినల్ ఆఫీస్ ఏజీఎం చైతన్య కుమార్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని సూర్యానాయక్ తండా గ్రామంలో గురువారం నాబార్డ్ ఆర్థిక సౌజన్యంతో గోరికొత్తపల్లి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృంద కళా కారులు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు అందించే సేవలు మొబైల్ బ్యాంకింగ్, వ్యవసాయ పంట రుణాలు, మహిళా సంఘాల రుణాలు, బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీ రుణాలు, డిపాజిట్లపై అత్యధిక వడ్డీ, బీమా పథకాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలను ఆటపాటల రూపంలో తెలిపారు. అనంతరం చైతన్యకుమార్ కుమార్ మాట్లాడుతూ పంట రుణాలు సంవత్సరం లోపు రెన్యూవల్ చేసుకోడం వల్ల వడ్డీ రాయితీ వస్తుందన్నారు. ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాల్లో ప్రతి ఖాతాదారుడు చేరాలన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సూర్యానాయక్ గ్రామానికి చెందిన ఎల్లబోయిన నారాయణ కుటుంబ సభ్యులకు రూ. 20లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మల్లేశ్, డీఓ ఎన్‌పీఏ వరంగల్ శ్రీనివాస్, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీఐ బీడీఎం రంజిత్, బ్యాంకు మిత్రలు భూక్యా భాస్కర్, కుమారస్వామి, నాగారాజు పాల్గొన్నారు.



నారాయణ కుటుంబ సభ్యులకు రూ. 20 లక్షల చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

నియామకం

హసన్‌పర్తి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా హసన్‌పర్తికి చెందిన కె.జ్ఞానేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన మాజీ వార్డు సభ్యుడు పోతరాజు ప్రభాకర్ నియమితులయ్యారు. ఈమేరకు ఫోరం రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ గురువారం ప్రకటించారు.